# మశకంత పేగు

- పంజాల జగన్నాథం



ఎన్నో కలలు... కన్నీళ్లు... ఆశలు... అడియాశలు...అవహేళనలు... అవమానాలు... మరెన్నో జ్ఞాపకాలు ఉమా మహేశ్వర్ మనస్సుని పట్టి కుదిపేస్తున్నాయి. ఉదయం జరిగిన సంఘటన అతని హృదయాన్ని కలిచివేస్తోంది. మానిపోయిందనుకున్న మనస్సు గాయం మళ్ళీ

పెచ్చురిల్లుతుంది. కన్న బిడ్డల సూటిపోటి మాటలు ఈటల్లా తన గుండెల్ని ఛిద్రాలు చేస్తుంటే అతనూ, అతని భార్య గంగా భవానీ ఆత్మాభిమానాన్ని చంపుకుని జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. క్రమ శిక్షణగా పెంచీ, పెద్దజేసి తమ చెప్పుచేతుల్లో ఉంటారనుకున్న పిల్లలు ఎంతో మారిపోయారు. వాళ్ల చర్యల వల్ల ముసలి దంపతులకు మనశ్శాంతి లేకుండా పోయింది. పెళ్లిళ్ళు అయి కాగానే 'వేరు కాపురాలు' అంటూ భార్యల అడుగులకు మడుగులొత్తారు. స్వార్థపు కోరల్లో చిక్కుకుని బంధాలు, బాంధవ్యాలు అనురాగాలు, అనుబంధాలు అన్నీ మరిచి పోయారు. ఉమామహేశ్వర్ దంపతులు భవ బంధాలను తెంచుకోలేక సంసారపు విషవృక్షానికి చిక్కుకుని పెనుగులాడుతున్నారు.

ఉమామహేశ్వర్ రిటైరేడ్ లెక్చరర్. అతని భార్య గంగా భవానీ ఆకు చాటు పిందెవోలె భర్త చాటు భార్య. భర్తకు ఏనాడూ ఎదురు చెప్పి ఎరుగదు. ఆంధ్రుల స్త్రీ జాతికి అచ్చం పదహారణాల సంకేతం. కట్టు, బొట్టు, వ్యవహారం అన్నీ చూపరులకు ఇట్టే సాంప్రదాయాల్ని పుణికిపుచ్చుకున్న సద్గృహిణిలా భావం కల్గుతుంది. మూర్తీభవించిన పవిత్రమైన 'హైందవస్త్రీ'లా అనిపిస్తుంది. ఆమెను చూస్తే చేతులెత్తి నమస్కరించాలనే భావం కలుగుతుంది. గంగా భవానీ గ్రాడ్యుయేషన్ వరకు చదువుకుంది. చదువుకు తగ్గ తెలివి తేటలు గల మనిషి. పెళ్ళయ్యాక భర్తతో గుంభనంగా కాపురం చేసింది. తనకు తానుగా ఏనాడూ ఏకోరికా కోరలేదు. ఉన్నదాంట్లోనే తృప్తి పడ్డది. తనకు ఇల్లు, పిల్లలు, భర్త తప్ప వేరేలోకం తెలియదు. వాళ్ల సుఖసంతోషాలే తనవిగా భావించింది.

ఉమామహేశ్వర్ రిటైరయ్యాక చేసిన తప్పల్లా ఒక్కటే. తన కొచ్చిన గ్రాట్యుటీని, జి.పి.యఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్, పెన్షన్ డబ్బులు మొత్తాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగం పెద్ద కొడుక్కి ఒక భాగం చిన్న కొడుక్కి ఇచ్చాడు. మూడవ భాగం వృద్ధ దంపతులు తమ భాగంగా ఉంచుకొని, దానిని చిన్న కొడుకు నిరుద్యోగి అని, తమ భాగాన్ని అతనికి ఇచ్చి అతనితో ఉండడానికి నిశ్చయించుకున్నారు. కాలం దొర్లుతోంది. సమస్యలు మొదలయ్యాయి. ఉమామహేశ్వర్ సంపాదనకు దూరమయినాడు. రిటైరయ్యాక ఉమామహేశ్వర్ దంపతులు తమ శేష జీవితం చిన్న కొడుకు వద్ద ప్రశాంతంగా గడుస్తుందనుకున్నారు. కానీ సంపాదనలేని మనిషి సమాజం లోనే కాదు గదా! ఇంట్లో కూడ లోకువ అవుతాడనేది ఉమామహేశ్వర్ పట్ల సత్య దూరం కాలేదు. కొద్ది కాలంలోనే ఆ దంపతులు కన్న పిల్లల ఈసడింపులకు గురి అయ్యారు. ఉన్నదంతా పిల్లలకు ధారపోసి చేతిలో చిల్లి గవ్వ లేకుండా చేసుకుని పరాన్న జీవుల్లా పిల్లల మీద ఆధారపడి బతుకుతున్నారు. వాళ్ల బతుకులు కొడుకు, కోడండ్ల ముందు కడు హేయంగా మారాయి.

ఉమామహేశ్వర్ ఎంతో కష్టపడి పైకొచ్చినవాడు. నిజానికి ఉమామహేశ్వర్ ఓ విధివంచితుడు. రోడ్ ఆక్సిడెంట్‌లో తన తల్లి దండ్రుల్ని కోల్పోయిన అభాగ్య జీవి. అపుడు అతని ప్రాయం ఆరు సంవత్సరాలు. ఓ అనాథాశ్రమం ఆశ్రయం ఇచ్చింది. కొంత వయసొచ్చాక బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టాడు. ఎన్నో ఒడుదుడుకుల్ని అధిగమించాడు. కిరాణా షాపుల్లో ఖాతాలు రాశాడు. బస్టాండ్లో సామాన్లు మోశాడు. బిల్డింగ్ నిర్మాణాలకు ఉప్పరి పని చేశాడు. రాత్రిళ్లు రిక్షాతొక్కాడు. అనాధగా పెరిగిన తనూ చదువుకోడానికి చేయని పనంటూ లేదు. డెయిలీ పేపర్లు పంచాడు. పాల పాకెట్లు సరఫరా చేశాడు. వీలు చిక్కినప్పుడల్లా లైబ్రరీలో పుస్తకాలతో కాలం గడిపేవాడు. సామాజిక పరమైన అనేక సమస్యలను అవగాహన చేసుకుని జన బాహుళ్యాన్ని చైతన్య పరిచే చక్కని రచనలు చేసి పత్రికలకు పంపించేవాడు. ఆయన రచనల్లో నిజాయితీ, సేవాభావం, ఆత్మగౌరవం కనబడేవి. పత్రికల వాళ్లు పారితోషికం రూపేణా పంపించే కాస్తా కూస్తో ఆ డబ్బుని తన చదువుకు వినియోగించుకునేవాడు. అలా తన జీవితంలో ఒక్కొక్క సోపానాన్ని అధిగమించాడు. ఎంతో కష్టపడి అకుంఠిత దీక్షతో ఉన్నత చదువుల్ని పూర్తి

చేశాడు. లెక్చరర్ ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఓ పేదింటి పిల్లను పెళ్లిచేసుకుని జీవితంలో స్థిరపడ్డాడు. రచనల్లోనే కాదు, జీవితంలో కూడా ఆదర్శాల్ని అనుసరించాడు. గంగా భవానీ అర్ధాంగి అయింది. పువ్వుకు తావి అబ్బినట్టు ఉమామహేశ్వర్ వ్యక్తిత్వానికి తగ్గట్టుగా గంగాభవానీ గుణగణాలు సరిపోయాయి. ఉమామహేశ్వర్ జీవితంలో ఎన్నో ఒడుదుడుకుల్ని ఎదుర్కొన్నాడు. ఎన్నో అవమానాల్ని సహించాడు.

విద్యార్థిలోకంలోనే ఓ మంచి లెక్చరర్‌గా పేరు తెచ్చుకున్నాడు. వాళ్లకి సబ్జక్ట్స్‌తో పాటు జీవిత పాఠాలు ఉద్బోధించేవాడు. తన జీవితాన్ని నిరాడంబరంగా, ఆదర్శప్రాయంగా గడిపాడు.

ఉమామహేశ్వర్ పెద్దకొడుకు శశిధర్. బ్యాంకు ఉద్యోగి. మంచి జీతం. అంతకుమించిన జీవితం. భార్య శాలిని. డబ్బున్న కుటుంబం నుండి వచ్చింది. మిడిసిపాటు ఎక్కువ. తన తల్లిగారు ఉన్నవారనే దర్పం ఆమెలో కనబడుతుండేది. శశిధర్ భార్య ముందర దూదూ బసవన్నే.

చిన్న కొడుకు గిరిధర్ బి.ఏ పాసయ్యాడు. నిరుద్యోగ ప్రపంచంలో తనో సభ్యుడు. అతని ఆలోచనలు ఆకాశానికి నిచ్చెనలు వేసేవి. దుందుడుకు స్వభావి. కుదురుగా దేంట్లోను చివరిదాకా కొనసాగేవాడు కాదు. పెళ్లి అయింది. భార్య సుమిత. సౌమ్యురాలు. శాంతి స్వరూపిణి. మిత భాషిణి. అనుభవజ్ఞుల సలహాలను వింటుంది. ఆలోచిస్తుంది. ఆచరిస్తుంది. అత్తమామల్ని గౌరవిస్తుంది. తల్లి దండ్రులతో సమానంగా ప్రేమిస్తుంది. ఆదరిస్తుంది. భర్తకు భిన్నమైన స్వభావం తనది.

ఉమామహేశ్వర్ దంపతులు చిన్న కొడుకుతో కలసి ఉంటున్నారు. కొద్ది కాలమే గడిచింది. ఆ ఇంట్లో కలకలం మొదలయ్యింది. గిరిధర్ సమస్యలను పోషిస్తున్నాడు. ఏ ఇంట్లోనయినా కోడళ్లతో సమస్యలు మొదలవుతాయి. కానీ ఇక్కడ కొడుకే కారణం. సమస్యలను చిలికి చిలికి గాలివాన చేశాడు గిరిధర్. అన్నింటికి మూలం ఆర్థిక సమస్యలే. వాటి ముందు సుమిత వ్యక్తిత్వం కూడ పనిచేయలేకపోయింది.

గిరిధర్ తనవాటా, తండ్రి వాటా మొత్తం డబ్బుల్ని ఫైనాన్స్ బిజినెస్‌లో పెట్టాడు. 'ఆ బిజినెస్ మనకొద్దు' అని తండ్రి, అన్నయ్య ఎంత చెప్పినా ససేమిరా వినలేదు. స్వల్ప కాలంలోనే కుబేరుడ్ని కావాలనుకున్నాడు. ప్రయివేట్ ఫైనాన్స్ పేరిట ఎక్కువ వడ్డీ చెల్లిస్తామని డిపాజిట్లు సేకరించాడు. హైర్ పర్చేస్ కింద వెహికిల్స్‌కు లోనులు యిచ్చాడు. రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో లక్షల్లో డబ్బులు పెట్టి ల్యాండ్స్ కొని ప్లాట్ల బిజినెస్ మొదలెట్టాడు. చిట్‌ఫండ్ ఆరంభించాడు. అన్నింటిలో అతనికి చుక్కెదురే అయ్యింది. వెహికిల్‌లోన్ తీసుకున్న వారు ఇన్‌స్టాల్‌మెంట్సు కట్టడం మానేశారు. వాళ్ల వద్దనుండి వెహికిల్స్ జప్తు చేసుకున్నాడు. అప్పటికే ఆ వాహనాలు కండీషన్ తప్పి చెడిపోయి ఉన్నాయి. 'అమ్మితే అడివి' అన్నట్లు వాటిని అమ్మినా లోన్ వాయిదాలు రికవరీ కాలేదు. రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో మొదట్లో కొద్దిపాటి లాభాలు కనిపించాయి. తర్వాత రాను రాను ఆ బిజినెస్‌లో మాంద్యం ఏర్పడింది. డబ్బులు లక్షల్లో ప్లాట్ల మీద పేరుకుపోయాయి. చిట్ ఫండ్ మెంబర్స్ చిట్స్ ఎత్తుకుని కిస్తులు చెల్లించడం మానేశారు. షూరిటీవాళ్లు చేతులెత్తారు. కోర్టుల్లో కేసులు, కేసుల చుట్టూ గిరిధర్ చక్రభ్రమణం. ఘోరంగా నష్టపోయాడని తెలిసిన డిపాజిటర్లు ఆవేశంతో గిరిధర్‌పై దాడి. ఉన్న స్థిరాస్తుల్ని కబ్జా చేసుకున్నారు. అవి డిపాజిటర్లకు ఏమూలకు సరిపోలేదు. గిరిధర్‌కు కాలూ, చేయీ ఆడని పరిస్థితి ఏర్పడింది. కుటుంబం బజారున పడింది. గిరిధర్ అన్న శశిధర్ వద్దకు వెళ్లాడు. తన దైన్యస్థితిని వివరించాడు. సహాయం అర్థించాడు. తమ్ముడు తన మాటలు మొదటినుండి పెడచెవిన పెట్టాడన్న కోపంతో దరికి రానివ్వలేదు శశిధర్.

"నాన్నా నా పరిస్థితి ఏం బాగోలేదు. నా పిల్లల్ని పోషించడమే భారంగా ఉంది. మీరు అన్నయ్య వద్దకు వెళ్లండి" అంటూ తల్లి దండ్రుల్ని ఉద్దేశించి నిర్దాక్షిణ్యంగా చెప్పాడు గిరిధర్.

"ఏమండీ! అలా మాట్లాడుతున్నారు. వాళ్లను పొమ్మనడం భావ్యం కాదండి. కష్టమైనా, సుఖమైనా

కలో గంజో తాగుతూ మనతోనే ఉంటారండీ. మనపిల్లలతో పాటు వాళ్లూ". ఎంతో శాంతంగా అంది సుమిత భర్త గిరిధర్‌తో.

"ఆ! చెప్పొచ్చావ్‌లే నీతులు. తా దూర కంతలేదు–మెడకో గంగడోలు' అన్నట్లు ఉన్నాయి నీ నీతి వాక్యాలు. మనకు పొట్ట గడవడమే కష్టంగా ఉంది. ఇక వాళ్లనేం పోషిస్తాం".

కొడుకు, కోడలి సంభాషణ ప్రత్యక్షంగా విన్నారు. పరిస్థితుల్ని ప్రేక్షకులుగా చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని కలలో కూడా వాళ్లు ఊహించలేదు. ఆత్మాభిమానాన్ని చంపుకుని గత్యంతరం లేక పెద్ద కొడుకు శశిధర్ వద్దకు బయలు దేరారు. కన్న హృదయాలు తల్లడిల్లాయి.

"బాబూ శశిధర్! తమ్ముడి పరిస్థితి ఏం బాగోలేదు. ఆర్థికంగా చితికిపోయాడు. కుటుంబం గడవడం కష్టంగా ఉంది. ఫైనాన్స్ బిజినెస్‌లో చాలా నష్టపోయాడు. ఎంతైనా కన్న హృదయం కదా! వాడి పరిస్థితి చూసి మా గుండెలు కొట్టుకుంటున్నాయి. నీకు తెలుసు, వాడికి ఆలోచన తక్కువనీ, వాడికి తోచిందే చేస్తాడనీ మన మాటలు పెడచెవిన పెట్టాడు. ఏమైనా వాడు నీ తమ్ముడు. మీ బ్యాంకు తరపున ఏమైనా సహాయం అందించరా!"

"నాన్నా! వాడి వాటాతో పాటు నీ వాటా కూడా వాడికే ఇచ్చావ్. వాడు ఆ డబ్బంతా ఫైనాన్స్ బిజినెస్, రియల్ ఎస్టేట్‌లో పెట్టి నష్ట పోయాడు. వద్దురా ఆ బిజినెస్, 'పేకాట శాస్త్రం' అంటే విన్నాడా! నాన్నా నాదీ ప్లాన్డ్ జీవితం. నాకు మటుకు నా కుటుంబాన్ని పోషించడమే భారంగా ఉంది. మంత్లీ బడ్జెట్‌లో కాస్త తేడా వచ్చినా ఆ నెలంతా అస్తవ్యస్తమే. ఇంక వాడికి ఆర్థికంగా నేనేం సహాయం చేయగలను? కాదూ కూడదూ అంటే 'అమ్మా, నాన్నా!' మీరిద్దరూ మాతో ఉండండి. అంతవరకు భరించగలను."

"బాబూ శశీ! నీవే అలా మాట్లాడితే తమ్ముడి గతి ఏంగాను. వాడు మూర్ఖుడే కాదనను! కానీ వాడు అనుభవ రాహిత్యంతో వ్యవహారాలు జేసి నష్టాల ఊబిలో కూరుకుపోయాడు. వాడిని ఒడ్డున పడేయాల్సిన బాధ్యత మనందరిది. నేను ముసలి వాడినయ్యాను. ఏమీ చేసే స్థితిలో లేను. నా తర్వాత పెద్దవాడిగా ఆ బాధ్యత నీది.

"సరే నాన్నా! వాడి సంగతి తర్వాత ఆలోచిద్దాం. బ్యాంకు ద్వారా వాడికి కొంత లోన్ యిప్పించి కిరాణా షాపు పెట్టిద్దాం. దానితో వాడు తన కుటుంబాన్ని పోషించుకోగలడు. ముందు కాళ్లూ, చేతులు కడుక్కుని ఇంట్లోకి పదండి. భోంచేద్దాం".

"మీ అమ్మా, నాన్నలు వచ్చి నాలుగు మాయమాటలు చెప్పగానే కరిగిపోయారా! వాళ్లు మనకు చేసిందేమిటి? తమ వాటా డబ్బుల్ని మీ తమ్ముడికి ఇచ్చారు. మరి పెద్దకొడుకు ఉన్నాడు. అతనికి భార్యాపిల్లలున్నారు. పెళ్లి కావలసిన పిల్ల ఉందని ఆలోచించారా! ఎంత సేపు చిన్న కొడుకు "చింత"నే తప్ప మనగురించి ఏనాడైనా పట్టించుకున్నారా! చిన్న కొడుకు పరిస్థితి తలకిందులు కాగానే తేరగా తిందామని ఇక్కడికి చేరారు." అంటూ పెద్ద కోడలు శాలిని భర్త మీద రుసరుస లాడింది.

"ఏమ్మా! చిన్నంత్రం, పెద్దంత్రం లేకుండా మాట్లాడుతున్నావ్. మేం మీకేం చేయలేదా? వాణ్ణి కన్నది ఎవరు? పెంచి పెద్దజేసింది ఎవరు? విద్యాబుద్ధులు చెప్పించిందెవరు? ఎట్లా మాట్లాడుతున్నావమ్మా! పంపకాలప్పుడు వాడి వాటా వాడికివ్వలేదా! అది ఎవరి కష్టార్జితం. 'ముందొచ్చిన చెవుల కన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి' అంటే ఇదేనేమో! వాణ్ణి కట్టుకోగానే మొత్తం పెత్తనం నీ చేతికొచ్చింది. వాణ్ణి గంగిరెద్దును జేసినవ్."

"అబ్బో! మహా నీతులు చెప్పొచ్చింది ఈ విడగారూ"! అంటూ చేతులు తిప్పుకుంటూ లోనికెళ్లింది శాలిని. "అమ్మా! నువ్వు మాట్లాడింది కాదంటలేను. కాని శాలిని అన్న దాంట్లో తప్పేముంది. మీ వాటా డబ్బులు తమ్ముడికే ఇచ్చారు. జీవితాంతం వాడితోనే ఉంటామన్నారు.".

"ఒరేయ్ తమ్ముడి తెలివితక్కువ తనంవల్ల వాడి ఆర్థిక పరిస్థితి చితికిపోయింది. మేమా వృద్ధులమై పోయాం. సంపాయించే స్థితిలో

లేమాయె. మరి ఈ పరిస్థితుల్లో మమ్మల్ని పోషించాల్సిన బాధ్యత నీది కాదా! నువ్వు కూడా నీ భార్యనే సమర్ధిస్తున్నావా!"

"అమ్మా! నీ కోడలు తత్వం నీకు తెలియంది కాదు. చర్చలెందుకు. ఇంట్లోకి నడవండి".

అన్యమనస్కంగానే అభిమానాన్ని పక్కన బెట్టి ఇంట్లోకి వెళ్లారు వృద్ధ దంపతులు. అలా మూలన కుర్చీల్లో కూర్చున్నారు. వాళ్ల మనస్సులు మనస్సుల్లో లేవు. గుండె నిండా బాధ ఉన్నపుడు, కళ్ల నిండా నీళ్లు ఉన్నపుడు మాట పెగలదు. కొంత సమయం కావాలి. పరిస్థితుల్ని జీర్ణించుకోలేక పోతున్నారు. ఒకప్పుడు వచ్చగా బతికిన ఉమామహేశ్వర్ ఇప్పుడు పత్రహరితం కోల్పోయిన మొక్కలా అయ్యాడు. నగర వాసంలో ఆధునికత నీడలో మానవత లోపించి 'గుండె' గదులు ఇరుకయిపోతున్నాయి. 'ఆర్థిక శాస్త్రమే' 'సామాజిక శాస్త్రాల్ని' శాసిస్తున్న తరుణంలో కన్న మమకారాన్ని కాదు పొమ్మనే ప్రబుద్ధులు కూడా తయారవుతున్నారు. పేగు తెంచి, రక్తాన్ని పంచి పెద్ద చేసిన కన్నవారిని నిర్దాక్షిణ్యంగా బయటకు గెంటేయడానికి సిద్ధపడుతున్నారు. ఉమామహేశ్వర్ మనస్సు పరిపరివిధాలా ఆలోచిస్తున్నది.

గడియారంలో సెకండ్లు... నిమిషాలు... గంటలు... రోజులు... గడుస్తూనే ఉన్నాయి. పెద్ద కోడలు ముందు వృద్ధ దంపతుల బతుకులు రోజు రోజుకు నికృష్టంగా మారసాగాయి. వేళకి భోజనం, టీ, టిఫిన్లు లేవు. ముసలాళ్లు ఆకలితో అల్లాడి పోతున్నారు. పైగా సూటిపోటి మాటలు, ఛీదరింపులు. కొడుక్కు ఇవేమీ తెలియవు. గుండెల్ని పిండే బాధలు వాళ్ల కళ్లల్లో కన్నీటి తెరలుగా మారుతున్నాయి. అవి గంగాభవాని కొంగూ, ఉమామహేశ్వర్ కండువా మాటున దాక్కుంటున్నాయి. శాలిని రాను రాను అత్తా, మామల్ని పని మనుషులుగా మార్చింది. మామని కరంటు, నల్లా, ఫోను బిల్లులను కట్టడానికి పంపుతోంది. రోజూ ఉదయం పాల పాకెట్లు తీసుకు రావలసిన బాధ్యత ఉమామహేశ్వర్‌దే. ఇంకా పిల్లల్ని స్కూలుకు చేరుస్తాడు. మధ్యాహ్నం లంచ్ బాక్సులు తినిపించి వస్తాడు. సాయంకాలం మళ్లీ వాళ్లని తీసుకువస్తాడు. పేపర్ చదివే తీరిక కూడ దొరకటంలేదు. గంగా భవానీ పరిస్థితి ఇంకా బాధాకరంగా ఉంది. ఉదయం వాకిలి ఊడ్చి అలుకు చల్లడం, పిల్లలకి స్నానాలు చేయించడం దగ్గర్నించీ డ్రెస్‌లు తొడగడం, తలలు దువ్వడం, జడలు వేయడం, బూట్లు తొడగడం వరకు అన్నీ చేసి స్కూలుకు సిద్ధం చేస్తుంది. అత్తా, మామయ్యలు రాగానే శాలిని పనిమనిషిని మాన్పించింది. అంట్లు తోమడం, వంట చేయడం, ఇల్లు తుడవడం, బట్టలుతకడం మొదలైన పనులతో గంగాభవాని సతమతమయ్యేది. వృద్ధులకు టి.వీ చూసే తీరిక దొరికేది కాదు. కనీసం ఆ వృద్ధ దంపతులు ఓ చోట కూర్చుని మాట్లాడుకునే వీలు చిక్కేది కాదు. ఎవరి పనుల్లో వారే నిమగ్నమయి పోయేవారు. కొడుకు ఉద్యోగం, ఇతరత్రా వ్యవహారాలతో ఎక్కువ సమయం బయటనే గడిపేవాడు. ఎప్పుడో రాత్రికి గాని వచ్చేవాడు కాదు. ఇవేమీ శశిధర్‌కు తెలిసేవి గావు. ఇంట్లో కోడలు 'రుసరుస'లు సతాయింపులు భరిస్తూ జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. వాళ్ళకు మనుమలు, మనుమరాళ్లతోటే కొద్దిపాటి మనశ్శాంతి లభిస్తోంది.

"నానమ్మ, తాతయ్యా' అంటూ చెరో అరటి పండు తెచ్చి యిచ్చింది ఆరేళ్ల మనుమరాలు చైతన్య. బతుకు ఎలా మారింది అని అనుకుంటూ ఆలోచనల్లో మునిగిపోయిన ముసలి దంపతులు మనుమరాలి పిలుపుతో తేరుకున్నారు. ఆరు బయట కూర్చున్న గంగా భవానీ, ఉమామహేశ్వర్‌లు మనుమరాలిని దగ్గరగా తీసుకుని ముద్దాడారు. "నా తల్లే! ఎంతయినా రక్త సంబంధం'' అంటూ గంగాభవానీ మనుమరాలినెత్తి మీద మెటికలు విరిచింది.

ఉమామహేశ్వర్‌కు తన ప్రమేయం లేకుండానే బాల్యం గుర్తుకు రాసాగింది. అతని కళ్లల్లో ఆనందం, విషాదం రెండూ మిళితమై కన్నీళ్ల రూపంలో కనబడసాగాయి. తాతయ్య తనని ఎలా ఆడించేది, పెరట్లో ఆరుబయట... పండువెన్నెల... కొబ్బరి చెట్ల నీడన నులకమంచం వేసుకుని చందమామలో ముసలమ్మను చూపిస్తూ పేదరాసి

పెద్దమ్మ కథల్ని వినిపించేవాడు. భట్టి విక్రమార్కుని సాహసగాథల్ని చెప్పేవాడు. రాత్రిళ్ల ఆకాశంలో చుక్కల్ని చూపిస్తూ గోరుకోలు, మూలచుక్క తెల్లారేచుక్క అంటూ ఏ చుక్కలు ఎప్పుడు పొడుస్తాయో రైతులకు ఆ చుక్కలతో ఏంప్రయోజనమో తెలిపేవాడు. పండు వెన్నెల్లో జానపదాలు పాడుకుంటూ తనని ఆనందడోలికల్లో ముంచేవాడు. ఎన్నో మధురస్మృతులు... మరెన్నో అనుభూతులు... తనని తన్మయం చేయసాగాయి. ఆ సంతోషం ఎంతో కాలం నిలువ లేదు. తన పసితనంలోనే వాళ్లు వృద్ధాప్యంతో కాలగర్భంలో కలిసి పోయారు. విధి వైపరీత్యం వల్ల అమ్మానాన్నలు యాక్సిడెంట్‌లో పోయారు. తను అనాథ అయ్యాడు. బతుకు రోడ్డున పడ్డది.

ఈ తరం మనుమలు, మనుమరాండ్లకు ఆ అనుభూతులేవి. తిలకించడానికి సహజ సిద్ధమైన సౌందర్యాలేవి? గుట్టలు, చెట్లు, వాగులు, ఒర్రెలు, మైదానాలు అన్నీ తరుక్కుపోతున్నాయి. పట్టణాల్లో పండు వెన్నెల ఏడ కనబడుతుంది. అంతా విద్యుత్ కాంతిమయం. ప్రపంచమే యంత్రమయం. ఈ కాలం పిల్లలకి చదువు విషయంలో టైట్ షెడ్యూల్. ఓ ఆలనా లేదు, పాలనా లేదు, క్రమశిక్షణ పేరిట విద్యాలయాలు నిర్బంధ జైళ్లుగా మారుతున్నాయి. 'ఫాం కోళ్లు' మాదిరి కేవలం వాళ్లు చదవాలి. ర్యాంకులు తేవాలి. వృద్ధుల పరిస్థితి అదేమాదిరిగా దయనీయంగా ఉంది.

అప్పట్లో వృద్ధాప్యం ఒక వరం. మనుమలతో, మనుమరాండ్లతో ఉల్లాసంగా గడిపేరోజులు అవి. జీవిత చరమాంకంలో ఆనందాన్ని ఆరబోసుకునే ఒక జాగృతావస్థ. తమ స్వీయ అనుభవాల్ని భావితరాలకు పంచియిచ్చే విద్యావ్యవస్థ వాళ్లది. బాధ్యతల భారంతో అలసిసొలసిన ఆ వృద్ధ తరం కుటుంబసభ్యుల ఆత్మీయతను బంధాల మధ్య ఆడీ పాడే పసి పాపల్లో ఒకరిగా మమేకమై గడిపి మహా ప్రస్థానాన్ని ముగిస్తూ మహాభినిష్క్రమణం చేసేవాళ్లు.

నేడు వృద్ధాప్యం ఒక శాపం. తల్లి దండ్రులకు, బిడ్డలకు పొసగని లోకంలో ఆర్థిక సంబంధాలే అనుబంధాలను శాసిస్తున్న నేపథ్యంలో కాటికి కాళ్లు చాపుకుని, చావు కోసం ఎదురు చూసే దురవస్థ. ఆర్థిక క్లేశాల్లో చిక్కుకున్న బిడ్డలు ప్రేమపాశాలను మరిచిపోతున్నారు. పేగు తెంచుకు పుట్టిన వారే తల్లి దండ్రుల్ని విస్మరిస్తున్నారు. ఫ్లోరోసెంటు దీపాల మధ్య చందమామ కనబడదు. చల్లని వెన్నెల వాకిళ్ల అనుభవాల పరవళ్లు కంటికి కానరావు. కూనలమ్మ పదాలు లేవు. జానపదాల సంగీతం లేదు. వృద్ధులంటే అనుభవాల పుటలు నిండిన పుస్తకాలనీ... జీవితం కాచి వడబోసిన సారం అనీ భావించడం లేదు. కేవలం తమ స్పీడ్ లైఫ్‌లో స్పీడ్ బ్రేకర్లుగా అనుకుంటున్నారు. ఉమామహేశ్వర్ మస్తిష్కంలో ఎన్నో ఆలోచనలు సుడిగుండంలా తిరుగుతున్నాయి. భారంగా నిట్టూర్చాడు. ఒడిలోవున్న మనుమరాలి తలని ప్రేమగా నిమిరాడు సజలనయనాలతో.

"ఏమోయ్ గంగాభవానీ! ఈ తరం పిల్లలంతా ఇంతే! వృద్ధాప్యంలో వీళ్లు మనకేదో చేస్తారని ఆశపడడం మన మూర్ఖత్వం. నా ఒంట్లో ఇంకా ఓపికా, సత్తువా ఉన్నాయి. నేనేదయినా ప్రయివేటు కాలేజీలో చేరుతా. మన బతుకులు మనం బతుకుదాం. మన జానెడు పొట్టలకు పిడికెడు మెతుకులు సంపాదించగలను. పద!" అంటూ కనుగుడ్లలో నీళ్లు తిరుగగా కండువాతో తుడుచుకుంటూ భార్య చేయి పుచ్చుకుని మనుమరాలికి టాటా చెబుతూ బయటకు నడిచాడు ఉమామహేశ్వర్. మనుమరాలు చైతన్య బిత్తర పోయి చూస్తోంది.

ఇంతలో శాలిని బయటకు వచ్చి 'ఏం మామయ్యా మీరు వెళ్లి పోతున్నారు. మీ అబ్బాయి వచ్చాక నన్నేమంటాడు. నన్ను బదనాం చేయడానికా' అనసాగింది.

"అబ్బే అదేమీ కాదమ్మా! వాడేమీ అనుకోడు. సంతోషిస్తాడు. వాడి మనస్తత్వం మాకు బాగా తెలుసు. మీరంతా కలసి మా బతుకుల్నీ 'మశ్కంత పేగుల్ని' చేశారు. అంతకంటే కావలసిం దేముందమ్మా!" అంటూ పగిలిన హృదయాలతో ఆగకుండా వెళ్లి పోయారు ఆ వృద్ధ దంపతులు.

❑